క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



సూర్యప్రకాష్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నేత కందివనం సూర్యప్రకాష్ శనివారం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నందిగామ రాంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రఘునాయక్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పల్లకీ సేవ



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఆటాపాటలు, భజనలతో స్వామివారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణానికి చెందిన నాగేశ్, జ్యోతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లతాశ్రీశైలంగౌడ్, ఎంసాని నర్సింలు, వసంతరావు, రఘునందన్‌రెడ్డి, రమేశ్, నర్సింలు, లక్ష్మణ్, కిషన్, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, యాదగిరి, రాఘవేందర్, కొత్త సత్తయ్య, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీ శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శిగా నర్సింలు



నర్సింలుకు నియామకపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శిగా ఎల్లకొండ నర్సింలు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, మండల అధ్యక్షుడు బసగాళ్ల రాములుగౌడ్ చేతుల మీదుగా ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ రోజురోజుకు బలోపేతం అవుతుందని చెప్పారు. ప్రజలంతా ఇప్పుడు బీజేపీ వైపే ఉన్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా గ్రామాల్లో తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం నర్సింలు మాట్లాడుతూ.. మండలంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీని అందించేందుకు పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ, నాయకులు ఎల్. ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు నవభారత నిర్మాతలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ నాగలింగం అన్నారు. శనివారం మా కన్వెన్షన్ హాల్‌లో శ్రీసత్యసాయి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ నాగలింగం ఆధ్వర్యంలో జూనియర్ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

విద్యారణ్య భారతిస్వామి

చేవెళ్ల: మండల పరిధిలోని మల్కాపూర్‌లో భువనేశ్వరీ సమేత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు పూజలకు హాజరైన ఆదిశంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతిస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హోమ పూజల అనంతరం హోమంలోని బూడిదను కళశంలో కలిపి పంచలింగేశ్వర ఆలయ గోపుర శిఖరంపై చల్లారు. అనంతరం హోమంలో పాల్గొన్న దంపతులకు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం విద్యారణ్య భారతిస్వామి మాట్లాడుతూ.. ప్రజలు దైవ చింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మండల నాయకులు, పలు గ్రామాలనుంచి ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కొనసాగింది.



విద్యారణ్య భారతిస్వామికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న భక్తులు



ఆయల శిఖర పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతీస్వామి

టిప్పర్ సడెన్ బ్రేక్..

- వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

చేవెళ్ల: ముందు వెళ్తున్న టిప్పర్ లారీ సడ్‌బ్రేక్ వేయటంతో వెనక వస్తున్న కారు లారీని ఢీకొట్టింది. ఈ ఘటన మోకిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్లూరు గేట్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొత్రేపల్లి గ్రామానికి చెందిన భీంరావు(25), అదే జిల్లా పూడూరు మండలం ఉమ్మెంతాల గ్రామానికి చెందిన రాహుల్‌రెడ్డి స్నేహితులు. వీరిద్దరూ కారులో రాత్రి జన్వాడ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో డిన్నర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొల్లూరు గేటు వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు వేగంగా టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న రాహుల్‌రెడ్డికి తీవ్రగాయలవ్వగా పక్క సీట్‌లో కూర్చున్న భీంరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని లంగర్‌హౌస్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉందని చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

కొందుర్గు: పోలింగ్ కేంద్రంలో ఉద్యోగులు ఎన్నికల నియమావళిని పాటించాలని, నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రమేశ్‌కుమార్ హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓపీఓలుగా విధులు నిర్వహించే సిబ్బందికి శనివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఆయా మండలాల తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందుర్గులో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు అనుమతి ఉండదన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రవీందర్‌గౌడ్, వివిధ గ్రామాల ఓపీఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేశ్‌కుమార్

భూములు ట్రస్ట్‌లకు కేటాయించడం తగదు

- జీవనోపాధి కోల్పోతున్న రైతులు
- తగిన పరిహారం చెల్లించాలి: పురుషోత్తం

బడంగ్‌పేట్: ఏళ్ల నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం డిమాండ్ చేశారు. శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో రైతు బాధితులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పురుషోత్తం మాట్లాడుతూ.. బొద్రమోని కుటుంబీకులు కుర్మల్‌గూడ సర్వే నంబర్ 80/3లో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిలో 60 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని.. ఈ భూమిని లాక్కుని బ్రాహ్మణ ట్రస్ట్‌కు రెండు, క్రిస్టియన్ శ్మశాన వాటికకు రెండు ఎకరాలు మిగిలిన భూమిని సైతం ఇతర ట్రస్ట్‌లకు కేటాయించారన్నారు. రైతుల పొట్టలు కొట్టి ట్రస్ట్‌లకు భూములు కేటాయించడం సరికాదన్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని లేదంటే వారికి న్యాయం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకురాలు ఆర్. ఝాన్సీ, రాజేశ్, రవినాయక్, భానుప్రసాద్, జి.లక్ష్మి, నారాయణ, భూ బాధితులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి

షాబాద్: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖలకు సంబంధించిన ఎజెండాను అధికారులు సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ అపర్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటి పన్నుల వసూలు 88శాతం పూర్తయినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. హరితహారంలో నాటిన మొక్కలకు నీరుపోసి సంరక్షించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ఎండీ అన్వర్, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఏఓ వెంకటేశం, ఏఈలు నరేందర్, శ్రీదివ్య, శారద, హార్టికల్చర్ అధికారి అశోక్, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింలు, వార్డెన్లు జ్యోతి, శంకర్, డాక్టర్లు వరలక్ష్మి, స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రశాంతిరెడ్డి

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

షాద్‌నగర్: రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి మూడునెలలు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసిన కరువు ఛాయలు కనిపిస్తున్నాయన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా పచ్చని పంటలతో పొలాలు కళకళలాడేవని విమర్శించారు. రైతులకు మేలు జరిగేంతవరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. రైతులు అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడొద్దని, బీఆర్‌ఎస్ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్ యాదవ్, బచ్చలి నర్సింహ, శ్రావణ్, వెంకట్‌రెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

రైతులకు మేలు జరిగేంతవరకు పోరాటం

షాబాద్: రైతులకు మేలు జరిగేంతవరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం చేవెళ్లలో జరిగిన రైతు దీక్ష కార్యక్రమానికి షాబాద్ మండల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి అవినాశ్‌రెడ్డి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులు ఏనాడు కూడా ఇబ్బందులు పడలేదని తెలిపారు. పంటలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు నక్క శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, రమేశ్‌యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు కుమ్మరి దర్శన్, రాంచంద్రారెడ్డి, సురేందర్, మహిపాల్‌రెడ్డి, గోపాల్, నానిగౌడ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాబాద్: షాబాద్ నుంచి దీక్షకు తరలివెళ్తున్న జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, తదితరులు

‘జనజాతర’కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



చేవెళ్ల: చేవెళ్ల నుంచి సభకు వెళ్తున్న నాయకులు, ప్రజలు



షాద్‌నగర్: వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మొయినాబాద్‌రూరల్: నాయకులకు స్వాగతం పలుకుతున్న మహేందర్‌ముదిరాజ్



చేవెళ్ల: ముడిమ్యాల గ్రామం నుంచి సభకు వెళ్తున్న నాయకులు

షాద్‌నగర్: తుక్కుగూడలో శనివారం సాయంత్రం నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభకు షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న క్రికెట్ మైదానంలో వాహనాల ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 1000 వాహనాల్లో 15వేల మంది నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు. సభకు తరలివెళ్లిన వారిలో నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, తాండ్ర విశాల, శ్రావణ్‌రెడ్డి, రఘునాయక్, కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, శివశంకర్‌గౌడ్, బస్వం ఉన్నారు.

చేవెళ్ల: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి చేవెళ్ల నాయకులు ఆగిరెడ్డి, డీపీఆర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శైలజ, సమతల ఆధ్వర్యంలో చేవెళ్ల ప్రజలు, మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన బస్సులతో కలిసి తరలివెళ్లారు. మండలంలోని ముడిమ్యాల నుంచి పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పి.ప్రభాకర్, రావులపల్లి నుంచి సూర్యపేట శ్రీనివాస్, దామరగిద్ద నుంచి మధుసూదన్‌గుప్తా, అంతారం నుంచి వెంకటేశ్‌బాబు ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో వెళ్లారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

మొయినాబాద్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని కాంగ్రెస్ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం అజీజ్‌నగర్ సమీపంలో మత్స్యకారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్ జనజాతర సభకు వెళ్తున్న అందరికీ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇమ్మడి రవీందర్‌రెడ్డి, రాందాస్, ఆంజనేయులు, మాడి జగన్‌మోహన్‌రెడ్డి, బంది నరహరిముదిరాజ్, నారాయణపురం కరుణాకర్, ఎర్ర సదానందం, పంచలింగాల రాఘవరెడ్డి, జంగయ్యముదిరాజ్, సిరిగిరి కృష్ణా, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, సుభాష్‌రెడ్డి, రమేశ్‌ముదిరాజ్, వీరారెడ్డి, గజానంద్‌రెడ్డి, మాల శ్రీనివాస్, కొండకళ్ల భాస్కర్, కొండకళ్ల భిక్షపతి, శ్రీకాంత్‌ముదిరాజ్, వెంకటేశ్‌ముదిరాజ్, తొండుపల్లి సుధాకర్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మండల కేంద్రం నుంచి తరలిన బస్సులను స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మండలం నుంచి అత్యధికంగా కార్యకర్తలు తరలివెళ్లడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

డంప్‌యార్డును తొలగించాలి

షాబాద్: శ్రీరామ కాలనీకి ఆనుకొని ఉన్న డంప్‌యార్డును తొలగించాలని శనివారం కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అపర్ణకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలో ఉన్న డంప్‌యార్డు ద్వారా చెత్త చెదారం, వ్యర్థపదార్థాలు, జంతు కళేభరాల ద్వారా దుర్వాసన రావడంతో అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. డంప్‌యార్డులో చెత్తకు నిప్పంటించడంతో పొగతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కాలనీకి దూరంగా డంప్‌యార్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు బుగ్గ రాములు, శ్రీనివాస్, బాల్‌రాజు, పెంటయ్య, రాజు, జంగయ్య, కృష్ణ, విఠలయ్య తదితరులున్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



చేవెళ్లలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కేశంపేట: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండల నాయకుల ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10ఏళ్ల పాలనలో పీఎం మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాబోతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి, గౌండ్ల కృష్ణగౌడ్, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మహేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గణేశ్, మిట్టు, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, నరేశ్, అనిల్, శ్రీకాంత్, శ్రీనాథ్‌రెడ్డి, నితీశ్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్, శివగౌడ్, రఘు, నవీన్, జయసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

అదేవిధంగా మండలంలోని మల్కాపూర్, దేవునిఎర్రవల్లి, ముడిమ్యాల, ఆలూరు, ఊరేళ్ల, కందవాడ, అల్లవాడ, పామెన, న్యాలట, రామన్నగూడ, కమ్మెట, ఎన్కేపల్లి, రావులపల్లి, తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల బీజేపీ, బీజేవైఎం, యూత్ నాయకుల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు కృషి చేయాలి

షాద్‌నగర్: శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. శనివారం షాద్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబయ్య మాట్లాడుతూ.. నాటి కమ్యూనిస్టు విధానాలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా జనసంఘ్ పార్టీ ఏర్పాటైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయాన్ని సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్చాలం మురళీ, చెట్ల వెంకటేశ్, శంకర్‌నాయక్, హరిభూషన్, శ్యాంసుందర్, రాము, కాసోజు శివకుమార్, శ్రావణ్, నర్సింహ్మా, రంగన్నగౌడ్, వంశీ, ప్యాట అశోక్, సందీప్, సాయిగౌడ్, విజయ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



షాద్‌నగర్: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కేశంపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద కార్యకర్తలతో కలిసి బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ఆదేశాల మేరకు టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోటే శ్రీనివాసులు, లింగయ్య, ముల్తాంకార్ శివాజీ, నర్సింలు, విఠల్‌గౌడ్, రాంచందర్‌జీ, యుగేందర్, స్వామయ్య, సురేశ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీడీపీఓ నాగమణి అన్నా రు. శనివారం పట్టణంలోని రవీంద్రభారతీ పాఠశాలలో ఘనంగా స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. చదువుల్లో రాణించి మంచి భవిష్యత్ పొందాలని సూచించారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. యాజమాన్యం విద్యార్థుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవడం హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని రెడ్డిభవన్‌లో హిందూవాహిని నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూవాహిని రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్, కాకునూరిభరత్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ పట్టణ కన్వీనర్‌గా రమేశ్, కోకన్వీనర్లుగా ధన్‌రాజ్, రాఘవేందర్, యువవాహిని ప్రముఖ్‌గా వన్నాడ శివప్రసాద్, సభ్యులుగా అజయ్, వెంకటేశ్, రవీందర్, లడ్డును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. అనంతరం నూతన సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శేఖర్‌గౌడ్, శ్రవణ్, సాయిగౌడ్, విజయ్, శ్రీనాథ్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గుంత

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న గుంత ఒకరి ప్రాణం తీసుకుంది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముడిమ్యాల సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్, మహేశ్వరి(26) దంపతులు బైక్‌పై వికారాబాద్‌కు వెళ్తున్నారు. మండల పరిధిలోని ముడిమ్యాల సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న గుంతలోంచి బైక్ వెళ్లడంతో వాహనం అదుపుతప్పి ఇద్దరు ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మహేశ్వరి మృతి చెందింది. శ్రీకాంత్ చికిత్స పొందుతున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.